విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

హాస్టల్ కుక్స్ శిక్షణ శిబిరంలో జీసీడీవో గౌసియాబేగం

జనగామరూరల్, జూన్ 9 : పరిశుభ్రత పాటించడంతోపాటు విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని జీసీడీవో గౌసియాబేగం అన్నారు. కస్తూర్బాగాంధీ, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాల, బాలికల విద్యాలయం, కళాశాలల్లో వంట చేసే వారితో సోమవారం మండలంలోని సౌడారం కేజీబీవీలో జిల్లా స్థాయి శిక్షణ శిబిరం నిర్వహించారు. మొదటి రోజు బచ్చన్నపేట, చిల్పూరు, దేవరుప్పుల, స్టేషన్‌ఘన్‌పూర్, కొడకండ్ల, చౌడారం కేజీబీవీ, యూఆర్ఎస్, హాస్టళ్ల నుంచి హెడ్ కుక్స్, అసిస్టెంట్ కుక్స్ 42 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌసియాబేగం మాట్లాడుతూ హెల్త్ అండ్ హైజిన్ వంట తయారీకి కిచెన్ ఎస్‌వోపీ పాటిస్తూ కొత్త మెనూ ప్రకారం వంటలు చేయాలని సూచించారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె కోరారు. వివిధ రకాల వంటకాలపై శిక్షణ ఇచ్చిన అనంతరం పోషకాలు లోపించకుండా తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాస్, కేజీబీవీ ప్రత్యేకాధికారులు నవీన, రాణి, అకౌంటెట్లు మమత, రజిని పాల్గొన్నారు.

రొండ్ల లక్ష్మారెడ్డి సేవలు మరువలేనివి

లింగాలఘనపురం, జూన్ 9 : జనగామ మాజీ ఎమ్మెల్యే, దివంగత రొండ్ల లక్ష్మారెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు కొనియాడారు. లక్ష్మారెడ్డి వర్ధంతిని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ లింగాలఘనపురాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయించడంలో రొండ్ల లక్ష్మారెడ్డి ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మారెడ్డి కూతురు సుహాసిని, అల్లుడు రాంచంద్రారెడ్డి, కుటుంబ సభ్యులు రొండ్ల నరసింహారెడ్డి, మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాయకులు కేమిడి భిక్షపతి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఏదునూరి వీరన్న, శ్రీధర్‌రెడ్డి, కేమిడి యాదగిరి, కేలపు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నర్మెట, జూన్ 9: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 2015–16వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థినులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాడు పాఠశాలలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణ, పూర్వ ఉపాధ్యాయులు బీ వాసు, లచ్చిరాం, డీ లక్ష్మణ్, ఎల్ హరిసింగ్, బీ గురు, పూర్వ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

సమస్యలను తెలుసుకుంటున్న చంద్రశేఖర్

తరిగొప్పుల, జూన్ 9: మహాత్మాగాంధీ జాతీయ గ్రా మీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై సోమవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులపై డీఆర్‌డీవో అడిషనల్ పీడీ చంద్రశేఖర్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో మాలతి సమక్షంలో 2024–2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులను పరిశీలించారు. వాటి బిల్లుల వివరాలను ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో కలిసి ఆడిట్ చేశారు. అబ్దుల్‌నాగారంలో రూ.5,0 98, అక్కరాజుపల్లిలో రూ.600, అంకుషాపూర్‌లో రూ.3,036, భోజ్యా తండాలో రూ.3,036, బొంతగట్టునాగారంలో రూ.22,242, బొత్తలపర్రెలో రూ.1,724, కొత్తతండాలో రూ.7,981, మాన్‌సింగ్ తండాలో రూ.10,118, మరియపురంలో రూ.184, నర్సాపూర్‌లో రూ.4,096, సోలిపూర్‌లో రూ.24,421, తరిగొప్పులలో రూ.6,200, వాచ్యతండాలో రూ.2,580తో మొత్తంగా రూ.82,213 విలువైన పనుల్లో అవకతవకలు జరిగాయని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీనికి బాధ్యులైన వారి నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. కుటుంబంలో భార్య, భర్తలకు ఒకే కార్డు ఉండాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీవీసీ సంధ్య, క్యూసీ రాజవర్ధన్, ఎస్ఆర్‌పీ భగవత్‌రావు పాల్గొన్నారు.

కొత్త చట్టంతో భూసమస్యల పరిష్కారం

రెవెన్యూ సదస్సుల్లో అధికారులు

కుందారంలో తహసీల్దార్‌కు దరఖాస్తులిస్తున్న రైతులు

సింగరాజుపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆండాలు

లింగాలఘనపురం/దేవరుప్పుల/ బచ్చన్నపేట/ జఫర్‌గఢ్, జూన్ 9 : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవీందర్ అన్నారు. లింగాలఘనపురం మండలంలోని కుందారంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. శుక్రవారం వరకు మండలంలో 505 దరఖాస్తులు రాగా, కుందారంలో ఒక్కరోజే 160 దరఖాస్తులు వచ్చాయని ఆయన వివరించారు. వీటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిశోర్, జూనియర్ అసిస్టెంట్లు చంద్రతేజ, భాస్కర్, లింగమూర్తి, ఆర్ఏ దివాకర్, వీఆర్ఏలు రాములు, కృష్ణ, ఎల్లయ్య, టీం–2లో నాయబ్ తహసీల్దార్ శకీర్, సీనియర్ అసిస్టెంట్ భరత్‌కుమార్, ఏఆర్ఐ నిఖిత, జూనియర్ అసిస్టెంట్లు కృష్ణంరాజు, మల్లేశం, ఆర్ఏలు ప్రసాద్, కుమార్, వీఆర్ఏలు పరశురాములు, అనిల్ తదితరులు పాల్గొన్నారు. దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఆండాలు మాట్లాడారు. గ్రామాల్లో భూసమస్యలకు సంబంధించి రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూభారతి చట్టంతో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను పరిష్కరించేందుకు వీలుందన్నారు. గతంలో ఆర్‌వోఆర్‌కు దరఖాస్తు చేసిన రైతుల భూముల్లో ఎలాంటి వివాదం లేకుంటే పరిష్కారానికి నోచుకుంటాయన్నారు. గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 61 దరఖాస్తులురాగా వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ అధికారులను ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్, ఆర్ఐ రాజు, పంచాయతీ కార్యదర్శి వెంకన్న పాల్గొన్నారు. బచ్చన్నపేట మండలంలో సోమవారం రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ ఫణికిశోర్ మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు వంశీకృష్ణ, మునావర్, సిబ్బంది శ్రీనివాస్, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు. జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(ఐ)లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న మాట్లాడారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా భూ భారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శంకరయ్య, నాయబ్ తహసీల్దార్ అనిల్ బాబు, ఆర్ఐలు బలరాం, దేవేందర్ పాల్గొన్నారు.

జిల్లాలో పర్యటించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో సమావేశమైన ట్రైనీ ఐఏఎస్‌లు

జనగామ చౌరస్తా, జూన్ 9 : డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ సూచనల మేరకు సోమవారం ఐదుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందం జిల్లాలో పర్యటించింది. ట్రైనీ ఐఏఎస్‌లు కొయ్యడ ప్రణయ్, సౌరబ్ శర్మ, హరీశ్ చౌదరి, క్యారలీన్, సలోని జిల్లా కలెక్టరేట్‌ను సందర్శించారు. వీరికి అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్‌సింగ్ స్వాగతం పలికారు. కలెక్టరేట్‌లోని పలు శాఖలకు చెందిన విభాగాలను శిక్షణలో ఉన్న ఐఏఎస్‌ల బృందం పరిశీలించింది. అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి జిల్లా ప్రాధాన్యత అంశాలపై అధికారుల బృందం చర్చించింది. చారిత్రక నేపథ్యం కలిగిన ఫొటో గ్యాలరీని పరిశీలించారు. అనంతరం పెంబర్తిలోని హస్తకళల కోఆపరేటివ్ సొసైటీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ బ్రాస్, కాపర్, సిల్వర్‌తో తయారు చేసిన వివిధ రకాల ఆకృతులను పరిశీలించారు. రఘునాథపల్లి మండలంలోని కన్యక పరమేశ్వరి దేవాలయాన్ని సందర్శించి వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. వీరి వెంట లైజన్ అధికారులుగా జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర, జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి రవీందర్ ఉన్నారు. ఇదిలా ఉండగా ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందంలో కొయ్యడ ప్రణయ్ రఘునాథపల్లి మండల వాసి కావడం విశేషం.

రేపు, ఎల్లుండి తహసీల్ ఆఫీస్‌ల ఎదుట రైతు సంఘం ధర్నా

జనగామ చౌరస్తా, జూన్ 9 : రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11, 12 తేదీల్లో జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందునాయక్ తెలిపారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమ లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు, ఉపాధ్యక్షుడు మంగ బీరయ్య, మాచర్ల సారయ్య, మీట్యా నాయక్, యాకయ్య, రాములు, సుధాకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుపై రీసర్వే చేయాలి

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 9 : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి, అర్హులకు కేటాయించాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన 'ప్రజావాణి'లో గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రవీణ్ మాట్లాడుతూ పేదల ప్రభుత్వం అని చెప్పే కాంగ్రెస్ నేతలు నియోజకవర్గంలో పది శాతం నిజమైన పేదలకైనా ఇండ్లు మంజూరు కాలేదన్నారు. అధికార పార్టీ కార్యకర్తలు, ధనవంతులకు ఇండ్లు మంజూరు చేశారని ఆయన ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని కోరారు. వాస్తవాలను పరిశీలించి నిరుపేదలకు ఇండ్ల కేటాయింపులో ప్రాధాన్యమివ్వాలని డిమాండ్ చేశారు.

రసాయన ఎరువులు అతిగా వినియోగించొద్దు

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉమారెడ్డి

రఘునాథపల్లి, జూన్ 9: పంటల సాగులో రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగించొద్దని అసోసియేట్ డైరెక్టర్ అఫ్ రిసెర్చ్ డాక్టర్ ఉమారెడ్డి అన్నారు. మండలంలోని కన్నాయపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. వివిధ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ పంటలకు రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వినియోగిస్తే ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని అన్నారు. రసాయన ఎరువులు వాడే రైతులు సాధ్యమైనంత వరకు యూరియాను తక్కువ మోతాదులో వినియోగించాలని ఆయన సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన షాపులో రసీదు తీసుకోవాలని రైతులకు సూచించారు. దీనివల్ల పంట నష్టం ఏర్పడితే పరిహారం పొందేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఏవో రామునాయక్, ఏడీఏ వసంత లక్ష్మి, హార్టికల్చర్ ఆఫీసర్ శంకర్, ఏవోలు కాకి శ్రీనివాస్‌రెడ్డి, చంద్రన్‌కుమార్, కరుణాకర్ ఏఈవోలు యాకూబ్, వినయ్‌కుమార్, కల్పన, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

తిమ్మంపేటలో ఇంటి నిర్మాణానికి ముగ్గుపోస్తున్న ఇల్లందుల బేబి

జఫర్‌గఢ్/దేవరుప్పుల/స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 9 : ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టాలని జఫర్‌గఢ్ మాజీ జడ్పీటీసీ ఇల్లందుల బేబిశ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మంపేటలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆమె భూమి పూజ చేసి ముగ్గు పోశారు. అనంతరం మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. అర్హులందరికీ దశలవారీగా ఇండ్లు మంజూరవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కా ర్యదర్శి ప్రశాంత్, టీ భవాని, గాదె శ్రీలత, గాదె వెంకటరత్నం, ఇల్లందుల సుదర్శనం, కుమార్, ఇల్లందుల రజిత, సుజాత పాల్గొన్నారు. ఇదిలా ఉండగా దేవరుప్పుల మండలంలోని 32 గ్రామపంచాయతీల పరిధిలో మొదటి విడుతలో 279 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి. సోమవారం నుంచి గ్రా మాల్లో ముగ్గులు పోస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ తెలిపారు. గతంలో ఇందిరమ్మ ఇండ్లకు లాంఛనంగా ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి భూమి పూజ చేశారని వివరించారు. నిరుపేదలకు వారి సొంత స్థలాల్లోనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, లబ్ధిదారులకు దశల వారీగా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందన్నారు. మరోవైపు స్టేషన్ ఘన్‌పూర్ మండలం కోమటిగూడెంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి లకావత్ సంతోష్ భూమిపూజ చేసి ముగ్గు పోశారు. గ్రామానికి 18 ఇందిరమ్మ ఇండ్లు మంజూరవగా, ఐ దు ఇండ్లకు ముగ్గు పోసినట్లు ఆయన తెలిపారు. ఐదు విడుతలుగా బిల్లులు వస్తాయని, లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

రఘునాథపల్లి, జూన్ 9: మండల కేంద్రానికి చెందిన కడెం హనుమంత్ (59) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ హనుమంత్ గ్రామంలో అందరితో కలివిడిగా ఉండేవాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, నాయకులు గాదె మహేందర్‌రెడ్డి, మేకల నరేందర్, ఎన్ఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేశ్, నాయకులు పేర్నె రవి, నీలం యువరాజ్, కడారి రవి, గుండా వెంకటయ్య, కడారి ఐలమల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి బదిలీ

సుబేదారి, జూన్ 9 : పాలకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి బదిలీ అయ్యారు. మల్టీ జోన్–1లో ఎనిమిది మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సోమవారం ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. మహేందర్‌రెడ్డిని మహబూబాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

లంబాడీలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి

గాంధీనాయక్

కొడకండ్ల, జూన్ 9 : లంబాడీలను కాంగ్రెస్ పార్టీ చిన్నచూపు చూస్తున్నదని, అందుకే మంత్రివర్గంలో అవకాశం ఇవ్వలేదని జీసీసీ మాజీ చైర్మన్ అభిమాన్ గాంధీనాయక్ విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీలకు ప్రాధాన్యమివ్వకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగం పట్టుకుని అందరూ సమానమనే రీతిలో ఉపన్యాసాలు ఇస్తారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అత్యధిక జనాభాగా ఉన్న లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకపోవడం తమ సామాజిక వర్గాన్ని అవమానపర్చడమేనన్నారు. డిప్యూటీ స్పీకర్ పదవితో తమ వర్గానికే ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. లంబాడీలకు మంత్రి పదవి బిక్ష కాదని, అది హక్కు అన్నారు. రాష్ట్రంలో పది శాతం లేని ఓసీలకు ఏడు మంత్రి పదవులు ఇచ్చారని, అధిక జనాభా కలిగిన లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వలేద న్నారు. కాంగ్రెస్ పార్టీలో లంబాడీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి హటావో, లంబాడీ జాతి బచావో అనే నినాదాలతో ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెకర్లు పింకేశ్‌కుమార్, రోహిత్‌సింగ్

జనగామ చౌరస్తా, జూన్ 9 : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి 'ప్రజావాణి' నిర్వహించారు. ఈ సందర్భంగా 85 మంది అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. లింగాలఘనపురం మండలం కుం దారం గ్రామానికి చెందిన సాయిలు తన 27 గుంటల భూమికి సంబంధించి డిజిటల్ పెండింగ్‌లో ఉందని, దానిని పరిష్కరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. తరిగొప్పుల మండలం కనీలకుంట గ్రామానికి చెందిన నర్సింహులు తనకు సంబంధించిన ఎకరం 20 గుంటల భూమిని మరొకరు అక్రమంగా పట్టా చేసుకున్నారని, దీనిపై విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరాడు. జనగామ మండలం పెంబర్తి గ్రామానికి చెందిన సంకటి పార్వతమ్మ తన 28 గుంటల వ్యవసాయ భూమికి సంబంధించిన భూ రికార్డులను సవరించి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. బచ్చన్నపేట మండలం కొడవటూరు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు మామిడాల రాజేశ్వరి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అర్జీ అందజేశారు. స్టేషన్ ఘన్‌పూర్ మండలం నమిలిగొండకు చెందిన అట్ల రాజు యూరియా బస్తాకు రూ.252 ఉంటే ఫర్టిలైజర్ దుకాణదారులు అదనంగా మరో రూ.48 వసూలు చేస్తున్నారని, ధరల పట్టికను ప్రదర్శించడం లేదని తెలిపారు. రఘునాథపల్లి మండలం బాంజీపేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని పలువురు ఫిర్యాదు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తెల్లరేషన్ కార్డుదారులకు మూడు నెలల సన్న బియ్యాన్ని ఈ నెలాఖరులోపు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఆర్డీవో వసంత, డీఏవో రామారావు నాయక్, డీపీవో స్వరూప, డీడబ్ల్యువో ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

పండ్లతోటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

సంక్షేమ పథకాలపై కేంద్ర బృందం సంతృప్తి

జనగామ రూరల్, జూన్ 9 : కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో అమలవుతున్నాయని కేంద్ర బృందం సభ్యులు పుష్పలత, అకింత్ తెలిపారు. సోమవారం మండలంలోని వడ్లకొండ, సిద్దెంకిలో వారు పర్యటించగా మహిళా సంఘం సభ్యులు బోనాలు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, దీన దయాల్ అంత్యోదయ, సంసద్ ఆదర్శ గ్రామ్‌యోజన పథకాల పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం పుష్పలత, అంకిత్ మాట్లాడుతూ పథకాల అమలు తీరు బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, డీపీఎం వినీత రెడ్డి, ఎంపీడీవో ఉప్పుగల్లు సంపత్ కుమార్, ఏపీవో భిక్షపతి, ఈసీ మాధవరెడ్డి, టీఏలు అనిల్, జహంగీర్, గ్రామ కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్లు అనిత జయ పాల్గొన్నారు.

నేడు రఘుపాల్‌రెడ్డి సంస్మరణ సభ

రఘునాథపల్లి, జూన్ 9: సీపీఎం రాష్ట్ర నాయకుడు గంగసాని రఘుపాల్‌రెడ్డి సంస్మరణ సభ మంగళవారం జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని గబ్బెటకు చెందిన రఘుపాల్‌రెడ్డి ప్రజాఉద్యమాల్లో భాగస్వాములయ్యారని గుర్తు చేశారు. భూమి కోసం, భుక్తికోసం నాడు జరిగిన సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించారని తెలిపారు. సంస్మరణ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కడారి ఐలయ్య, ఇంజ వెంకటస్వామి, ముక్కెర నాగరాజు, పోషబోయిన అంజయ్య, ఇంజ వెంకటస్వామి, ముక్కెర తిరుపతి, రాకేశ్ పాల్గొన్నారు.

టెక్నోజిల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

'క్రీస్తుజ్యోతి'లో రెండు రోజులు 'టెక్నోజిల్'

జనగామ రూరల్, జూన్ 9 : మండలంలోని యశ్వంతాపూర్ గ్రామంలోని క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు టెక్నోజిల్ –25 కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం టెక్నోజిల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మొదటిరోజు టెక్ ఐడియా, పేపర్ ప్రజంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో వంటి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. సుమారు 800 మంది విద్యార్థులు ప్రవేశార్హత పొందారన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నోజిల్ కన్వీనర్ అల్లంకి సన్యాసిరావు, కో కన్వీనర్ సరిత, కోఆర్డినేటర్ యాకూబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోవాలి

తరిగొప్పుల, జూన్ 9: నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను వినియోగించుకోవాలని ఎంఈవో నెల్లుట్ల జానకి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాటలో భాగంగా సోమవారం మండలంలోని సోలిపురంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో నెల్లుట్ల జానకి మట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తే తల్లిదండ్రులపై ఆర్థికంగా భారం పడుతుందన్నారు. మెరుగైన వసతులు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు కార్తీక్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలి

పాలకుర్తి/కొడకండ్ల, జూన్ 9: గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కారించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు ఎం యుగేందర్, మాడరాజు సంతోష్ అన్నారు. జేఏసీ పిలుపు మేరకు సోమవారం జీపీ కార్యదర్శులు పాలకుర్తిలో ఎంపీడీవో ఆవుల రాములు, ఎంపీవో రవీందర్‌కు వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో జీపీల్లో నిధుల కొరతతో పంచాయతీ కార్యదర్శులు ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. ఓపీఎస్‌లుగా పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కపిలవాయి వెంకటేశ్వరాచారి, లింగయ్య, మహేశ్, వెంకటేశ్, మహేందర్, మోహన్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కొడకండ్ల మండలంలోని పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలపై ఎంపీడీవో నాగశేషాద్రిసూరికి వినతి పత్రం అందజేశారు. జీపీల నిర్వహణకు ప్రతి నెల నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఇందిర, పంచాయతీ కార్యాదర్శి గంట శ్రీనివాస్ పాల్గొన్నారు.

వివాహిత ఆచూకీ కోసం పోలీసుల దర్యాప్తు

దేవరుప్పుల, జూన్ 9: భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటానని లేఖ రాసి వెళ్లిపోయిన మండలంలోకి కడవెండికి చెందిన వివాహిత ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కడవెండి గ్రామానికి చెందిన దొంతిక కొమురయ్య కూతురు శృతిని నాలుగేళ్ల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం రాయికల్‌కు చెందిన ఆది పరమేశ్‌తో వివాహం చేశారు. పరమేశ్ భార్యతో కలిసి హైదరాబాద్‌లో ప్రైవేట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. వీరికి రెండేళ్ల క్రితం పాప జన్మించింది. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం శృతి పుట్టింటికి వెళ్లింది. తన భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటానని ఈ నెల 5న అర్ధరాత్రి లేఖ రాసి, పాపను ఇంట్లోనే వదిలి వెళ్లిపోయింది. దీంతో ఆందోళన చెందిన శృతి తండ్రి కొమురయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా శృతి తన వెంట సెల్‌ఫోన్ తీసుకెళ్లినప్పటికీ స్విచ్ ఆఫ్‌లో ఉంది. ఎస్సై సృజన్‌కుమార్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ శృతి గతంలో మరొకరిని ప్రేమించిందని తెలిసిందన్నారు. ఆమె చనిపోలేదని, ఎక్కడ ఉందనే విషయమై గాలిస్తున్నామని తెలిపారు. లొకేషన్ ఆధారంగా శృతి ఉన్న ప్రాంతాన్ని గుర్తించామన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

నర్మెట, జూన్ 9: ద్విచక్ర వాహనదారులపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నైనాల నగేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వంగపల్లి రాజు, బండి శ్రీనివాస్ బైక్‌పై సోమవారం తరిగొప్పుల మండలం పోతారానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇదే దారిలో అక్కరాజుపల్లికి చెందిన గాలి రవితోపాటు అతడి కుమారుడు మట్టిలోడుతో ట్రాక్టర్ నడుపుతూ వెళ్తున్నారు. బైక్‌పై వెళ్తున్న వారిపై మట్టి పడడంతోపాటు సైడ్ ఇవ్వకపోవడంతో ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసి డ్రైవర్‌ను ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన గాలి రవితో పాటు ఆయన కుమారుడు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వంగపల్లి రాజు, బండి శ్రీనివాస్‌పై ఇనుప రాడ్లతో దాడి చేశారు. దీంతో రాజు పక్కటెముకలకు, శ్రీను తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు గాలి రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

జఫర్‌గఢ్, జూన్ 9 : మండలంలోని హిమ్మత్‌నగర్‌కు చెందిన మచ్చ రామచంద్రయ్య (57) వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానలో చికిత్సపొందుతూ మృతి చెందాడని ఏఎస్సై వెంకట నారాయణ తెలిపారు. ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. హిమ్మత్‌నగర్‌కు చెందిన రామచంద్రయ్యతో పాటు అతడి సోదరుడు సమ్మయ్యకు మధ్య భూ వివాదం ఉంది. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీన రామచంద్రయ్య తన వ్యవసాయ బావి వద్ద ఉన్న పురుగుల మందు తాగి, తన సోదరుడు సమ్మయ్య ఇంటి ముందుకు వెళ్లి మీరు చేయబట్టే నేను పురుగుల మందు తాగానంటూ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని ఏఎస్సై పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెంకటనారాయణ వెల్లడించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

జ్యోతిష్యం చెప్పబడును
★ శ్రీమేడారం ఓంశక్తి జ్యోతిషాలయం. విద్య, ఉద్యోగం, విదేశీప్రయాణం, వ్యాపారం, నాగ దోషము, నరగోశ ప్రేమించుకున్న వారు దూరం అవటం, ఎన్ని సంబంధాలు వచ్చినా పెళ్లి కుదరకపోవడం, సంతానం లేకపోవడం, భార్య, భర్తల మధ్య కలహాలు రావటం మరియు ఎటువంటి సమస్యలకైన శాశ్వత పరిష్కారం 3 రోజులలో 100% చేయబడును. అన్ని మతాల వారికి జ్యోతిష్యం చెప్పబడును. గురూజీ కోయరాజు : రాజు గారు. సంప్ర: సెల్: 9912280354.
NTW-337017

CHANGE OF NAME
I, THURPATI RAJU S/o SAMMAIAH, R/o H. No. 1-9/2, Tekumatla Village & Mandal, Jayashankar Bhupalpally district. I have changed my daughter name from THURPATI AMMULU to THURPATI SATHWIKA for all Purposes.

WANTED
★ ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

WANTED
jobs Apply Now!
★హనుమకొండలో గల ప్రముఖ కార్ డెకార్స్ నందు పనిచేయుటకు కార్ ఎలక్ట్రిషన్స్, సూపర్‌వైజర్స్ (Female) మరియు కార్ వాషింగ్ చేయుటకు Male/Female వర్కర్స్ కావలెను. సెల్: 7995621165, 6303776310.
NTW-307

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565